# శకుంతల వధికి ఎవరు కర్తలు?

( క థా నిక )

రాముడి కింకా పద్ధెనిమిదేళ్లు నిండలేదు. బి.ఏ. చదువుతున్నాడు. మంచి తెలివి తేటలు, చురుకుదనం కలవాడు. ఇతరులనేకులు అలాంటివారు తెలివిపరులు లేకపోలేదు. కాని తేడా ఏమంటే వీడికి వాళ్ళంటే గిట్టదు. అది అసూయకూడా కాదు. వాడి క్లాసు పిల్లల్లో కొందరు చిన్న తరగతులనుండి తనతోనే చదువుతూ వచ్చినవాళ్లు. వాళ్ళంతా ఒక గూడు పురాణి. ఇతరులతో-అంటే కొత్తగ చదువులో వెనకబడ్డ వాళ్ళతో మాట్లాడాలంటే వాళ్ళకు విసుగు, ధీమా. రాముడివెంట ఎల్లప్పుడూ తక్కువ మార్కుల కుర్రాళ్లు కొందరు తిరుగుతూవుంటారు. పరీక్షలలో వీళ్ళచేత చదివించి ప్యాసు చేయించడం కొంత రాముడి భారమే. పైగా సమ్మెల్లోనూ యితర పోట్లాటల్లోనూ వీళ్ళతోపాటే వుంటాడు రాముడు.

"ఆరునెల్ల సావాసంతో..." అన్నట్లు వాళ్ళ గుణాలు వీడికీ, వీడి గుణాలు వాళ్ళకు కొన్నికొన్ని అబ్బినాయి. ఇప్పుడు వాళ్లు కేవలం ఒక తరగతి విద్యార్థులు, స్నేహితులే కాదు. వాళ్ళదో చిన్న సంఘం. సమాజం, దానిలోని అన్యాయం అవినీతిని సహింపలేకపోవటం, దాన్ని అంత మొందించాలన్న దీక్ష నానాటికీ పెరిగిపోతున్నవి. ఇంకా పైకి వెళ్లుతున్నారు. ప్రభుత్వాలు, ప్రభుత్వచట్టాలు, వాటి విమర్శనలు యివికూడా బయలుదేరినవి.

రాముడి తండ్రి వాడిలోని యీ లక్షణాలన్నింటినీ ఒకకంట కనిపెడుతూనే వున్నాడు. నీసాటివాళ్ళతో వుండక యీ అల్లరి మూకేమిటిరా, అని రెండుమూడుసార్లు మందలించాడు గూడా. తండ్రి మాటలకు తల్లి తాళం వేస్తూనే వచ్చింది. తండ్రిదగ్గర నిర్భయంగా మాట్లాడే అలవాటు రాముడి కెందువల్లనో కలగనేలేదు. అందుకని తీరికగా వున్నప్పుడుచూచి తల్లికి తన భావాలను గూర్చి బోధిస్తూ వుంటాడు. కాని అవేవీ ఆమె తల కెక్కేవిగా కనుపించటల్లేదు.

ఇలా జరుగుతూనే వున్నది. దీనినిగురించి ఎవరికీ ఎక్కువ బాధగాలేదు. ఎందువల్లనంటే ఎవరివి ఏ భావనలైనా ఇంట్లో ఏ కీచులాటలూ లేకుండా వెళ్ళిపోతున్నది. భావనలు భావనలుగానే వున్నాయిగాని, ఆచరణాన్వితం కావటల్లేదు.

కాస్తోకూస్తో వున్నవాళ్ళబ్బాయి, బి. ఏ. చదువుతున్నాడంటే ఏపిల్ల తండ్రికైనా ఆశరగుల్తుంది. తన కూతురెంత మోటుపిల్లయినా, చదువుకోనిదయినా, అనాకారయినా, వరుడు మాత్రం సలక్షణ సంపన్నుడుగా వుండాలని ప్రతి సామాన్యజనకుని కుతూహలము. నిజానికి గృహస్థాశ్రమ స్వీకారానికి యీ బాహ్య లక్షణాలన్నీ అవసరాలు కాజాలవు కదా!

ఐతే శకుంతల అలాంటిది కాదు. రాముడి బళ్ళోనే థొర్డుఫారందాకా చదివింది. రాముడికీ శకుంతలకూ చెప్పుకోదగ్గ పరిచయం లేకపోయినా ఒకరినొకరు యెరుగుదురు. రాముడి తెలివితేటలకు, అంతకంటె ఎక్కువగా తన విద్యను వెనుకబడినవారి సహాయానికి వినియోగించే అతని విశాలభావాలకు ఆమె గౌరవమిచ్చింది. శకుంతలలోని నిరాడంబరత కలుపుగోలుతనము, ప్రవర్తనలోని నమ్రత రాముడికి విశేషంగా నచ్చినవి.

శకుంతల తండ్రి నాలుగురాళ్లు పోగుచేసి దాదాపు జీవితంలోని ఆఖరుదశకు చేరుకుంటున్నాడు. కూతురు వివాహమై ఆయనకు చింతలేదు కాని త్వరగా చేసి వెయ్యాలని కుతూహలంగా మాత్రం వున్నది. కాబట్టి రాముడి తండ్రివద్దకు వచ్చి బేరంపెట్టాడు. మూడువేల కట్నం యితర లాంఛనాలు

విశ్వనాథ

జరిపేటట్లుగా ఒప్పించి ఒప్పుకున్నాడు. రాముడి తండ్రి, కొడుకు బి. ఏ. పూర్తి అయిందాక ఆగమని అని చూచాడు. కాని సగం మనస్సుతో చెప్పినమాట కాబట్టి ఎదుటిపక్షం వీల్లేదనగానే వూరుకున్నాడు. రాముడి తల్లి, ముసలమ్మలు కూడా పెళ్ళి చూడనివారివలె తాము బ్రతికుండగానే పెళ్లి జరగాలని ఒత్తిడి చేశారు. ఆనెలలోనే పెళ్లిలగ్నం నిశ్చయమైంది.

రాముడికిదంతా కలగా వున్నది. తన పెండ్లి విషయమెప్పుడూ ఆలోచించుకోలేదు. అవును, పద్ధెనిమిదేళ్ల వాడికి ఏమి తొందర? కాని తన యింటివాళ్ళందరికీ తొందరగానే వుంది. ఇప్పుడు ఆలోచించుకునే వ్యవధిలేదు. పెండ్లేమిటని ప్రారంభించాడు. దాన్ని తలిదండ్రులు కుంటిసాకని చులకనగా తీసివేశారు. మన క్కావలసినప్పుడు పిల్లలు తయారుగా దొరుకుతారా అని ముసలమ్మ సమాధానపరిచింది. పరీక్షలు పూర్తికానియ్యమన్నాడు. అలా అయిన తరువాతనే కార్యం చేసుకుందువుగాని, అన్నారు. జీవితమార్గమే నాకింకా నిర్ణయం కాలేదన్నాడు. జీవితంలో పెండ్లి ఒక తప్పని అంశమన్నారు. అది తన మార్గాని కాటంకం కాజాలదన్నారు. వీళ్ళతో గెలవలేమని స్నేహితుల్ని అడిగాడు. చేసుకోమనే చెప్పారు లోక సంప్రదాయంగా. కట్నం గురించి కూడా చర్చ వచ్చింది. ఊరికే వచ్చేడబ్బును ఉత్తమంగా వినియోగించ వచ్చునన్నారు. సమస్య తేలిపోయింది. పెండ్లి చేసుకోవటమే భావ్యమయింది. పెండ్లికూతురు యిష్టం కూడా కావాలన్నాడు. అదీ సులభంగానే లభించింది.

పెళ్ళి మహావైభవంగా జరిగింది. అందరూ ఆశీర్వదించారు. అభినందించారు. అందుకు బదులుగా అల్పాహారా లారగించారు. కట్నాలు, చదివింపులు, ప్రత్యేక బహుమతులు వధూవరుల పైన కురిసిపడినయి. పెళ్ళితోపాటే కార్యం కూడా జరుపబడ్డది.

బి. ఏ. మొదటిఏటి పరీక్షలో రాముడు ప్యాసయ్యాడు కాని వెనకటివలె మార్కులు రాలేదు. పైతరగతికి వెళ్ళాడు. మామూలుగానే చదువు ప్రారంభించాడు. అప్పటికి శకుంతలకు నెలతప్పి అయిదు మాసాలయింది.

కాలేజి తెరిచి నెలరోజులు కాలేదు. సంస్థాన విద్యార్థిసంఘు తీర్మానం రాముడిచేతి కందింది. "నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకించి జరిపే యీ మహాపోరాటంలో విద్యార్థుల వంతేమంటే నాయకుల ఆదేశానుసారం పాఠశాలలను బహిష్కరించి సత్యాగ్రహోద్యమంలో వీరోచితంగా పాల్గొనాలి." రాముడు విద్యార్థి కాబట్టి యీ చరిత్రాత్మక భీషణ సంగ్రామంలో తన పాత్ర నిర్దేశింపబడినరీతిగా నిర్వహించితీరాలి. ఈ ఆలోచనలో అప్పటి ప్రచండ వాతావరణంలో తానొక విద్యార్థి మాత్రమేగాక ఒక నిండు చూలాలి భర్తనన్న మాట మనసుకు పట్టనేలేను. అందుకు కారణం రాముడిలో యీ రెండు దశలు అసహజంగా మిశ్రమం చెందటమే నేమో!

పోలీసు లానాడు అరెస్టు చేసినవాళ్ళలో రాముడున్నాడన్న వార్త వినేసరికి యింటిల్లిపాది గుభేలుమన్నారు. శకుంతల మూర్ఛపోయింది. తండ్రికి దుఃఖముకన్న ఎక్కువ ఆగ్రహం కలిగింది. తల్లి విధివ్రాతను దూషించుకొన్నది.

శకుంతల ఆరోగ్యం మళ్ళా కుదటపడనే లేదు. పదిహేనేండ్లు నిండని పసిప్రాయంలో గర్భవతి కూడాను. ఆమెకు ప్రసవకాలం సమీపించింది. శుష్కించిన శరీరంలోంచి ఏమి బయటపడాల్లో పడింది. ఆ సంసారానికి పెద్దలనుకోబడే వాళ్ళంతా అంతమాత్రానికే వెఱ్ఱి ఆనందం వెలిబుచ్చారు. కాని ఆ సంతోషం ఎంతో కాలం వుండలేదు.

జైలులో రాముడికి పాప పుట్టిందన్న లేఖ, పోయిందన్న తంతి ఒకేసారి ముట్టినవి. రాముడికి సంతోషం, దుఃఖం-రెండూ కలగ లేదు. అతని మనస్తత్వమే మారినట్లుంది.

శకుంతల రాముడికి ఒకటి రెండు వుత్తరాలు వ్రాసింది. ఆ పని అత్తగారికీ, ముసలమ్మలకు కినుక కలిగించింది. అంతతో ఆ యింట్లో మరో అధ్యాయం మొదలయింది. ఇప్పుడు శకుంతలకు యిదివరకులాంటి సౌకర్యాలు లేవు. చెడిపోయిన శరీరానికి మందులు కూడా సరిగా యిప్పించబడటం లేదు. ఆమె కాగితం కలం ముట్టరాదు. ఇంట్లో పని మనిషి

తోలగించబడింది. పుట్టింట్లో గారాబంగా పెరిగిందవటంచేత శకుంతల యీ క్రొత్త తాకిళ్లను సర్దుకోలేకపోయింది. ఈ పరిస్థితి యింటి పెద్దల ఆక్రోశాన్ని అధికం చేసింది. ప్రొద్దంతా వాకిట్లో నిలబడి చూడడంతోనే సరిపోతుందని యిలాంటివి కూడా బయలుదేరినాయి. పరాయి ముఖంలో అంతరాల నెరుగజాలని లేత చిరగుసు అగ్నితో కాపితే ఏమవుతుంది? పైగా శకుంతలకు మనస్సు విప్పి చెప్పుకునే దిక్కు లేకపోయింది. రోజులు గడిచిన కొద్దీ భరించటం కష్టమైపోతున్నది. ఏ నుయ్యో గొయ్యో చూచుకోక తప్పదనుకున్నది.

భగవంతుని స్తుతింపు వింటూంటే అంత దయాళుడనిపిస్తుంది. కాని చేసేవన్నీ ఏడిపించే చేతలే. కొంతమందికి మరీ నిష్కారణంగా, ఏ తప్పూ లేకుండానే మితిమీరిన ఘోరాలు చేస్తాడు. అందులో ఆయనకు ఆనందం కలుగుతుందో, ఏ ఆశయం సిద్ధిస్తుందో అర్థంకాదు.

శకుంతలకు అత్తగారింట్లో జరుగుతున్న అన్యాయానికి భగవంతుడు వంతవేశాడు. అంతే కాదు. ఆమె కష్టాలను యినుమడించి ఆ సంసారాన్ని చిందర వందరచేశాడు. ఒకనాడు తెల్లవారేసరికి పోలీసులు బావిలో పడి ప్రాణంవిడిచిన శకుంతల కళేబరాన్ని రాముడింటికి తీసుకవచ్చారు. అంతా విస్తుపోయి చూచారు!

యింట్లో వాళ్ల హృదయం కరిగిపోయింది. కాని అనుకోకుండా విడుదలయిన రాముడే ఆ సమయానికి యింటికి రాకపోతే అదృశ్యమంత భీషణంగా వుండేదికాదు. భార్యపై బడి పసిబిడ్డలాగ వాపోయాడు. ఓదార్చేందుకెవరికీ సాహసం చాలలేదు. తన ప్రియురాల్నెందుకలా చేశారని తలిదండ్రులకాళ్లమీద పడి వలవల ఏడిచాడు. తన జీవితమంతా ఆక్షణంలో యిమిడిపోయింది. ఇంత ఘోరపరిస్థితి నెదుర్కొనే స్థితిలో లేకపోవడమేకాక, ఒక వ్యక్తికి యింత కటిక అన్యాయం, యింత భీకర ప్రళయం ఎదురు రాగలదని వూహించుకోనైనా లేదు. ఏమనుకుంటే ఏమి లాభం? కనుమూసి తెరచేంతలో రాముడికి వందయేళ్ళ వయస్సు వచ్చినట్లయింది.

స్మశాన వాటికలో రాముడొక్కడే కూర్చుని యేదో ఆలోచిస్తున్నాడు. అంతలోనే ఇద్దరు మిత్రులు వచ్చి యింటికి రమ్మని ప్రతిమాలారు. ఎంతకు వినకపోవటం చూచి ఇంకా యితరులను పోగుచేసుకొద్దామని వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి రాముడు లేడు. ఎక్కడికి వెళ్ళాడో?

మరునాడు పత్రికలు శకుంతల మరణానికి రాముడి దుస్థితికి సానుభూతి తెలుపుతూ విద్యార్థి సంఘం చేసిన తీర్మానాన్ని ప్రకటించాయి.

# సత్పరిపాలనకు అష్టాదశ సూత్రాలు

కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు

పాల డబ్బాకోసం యేడ్చే పసివాని మొదలు పంచదారకోసం చేతులు మోడ్చే పెద్ద మనిషిదాకా ఒక్కడికీ ఒక్క నిమిషం తీరిక లేదు. స్తిమితంలేదు. శాంతిలేదు. తిండి, గుడ్డ, ఇల్లు, చదువు అనే ప్రాణసమస్యలు నాల్గూ దుష్టచతుష్టయంగా మారిపోయినవి. ప్రజల యొక్క, ప్రభుత్వంయొక్క ఆయుర్భాగ్యం అంతా వీటిమీద ఆధారపడివుంది. పరిపాలన మంచిచెడ్డలు ఆ బాలగోపాలానికి అర్థమయేది యీ నాల్గింటి మూలానే. ఈ ఆయువు పట్లు సమస్యల పట్ల యేమాత్రం ఏ మరుపాటు పొరపాటు చూపినా ప్రభుత్వం మనుగడ సంశయగ్రస్తం కాకతప్పదు. ప్రాణభూతములయిన యీ నాల్గూ పెనుభూతాలయితే, జాతి మత కుల విచక్షణ, స్త్రీ పురుషుడు, బాలుడు వృద్ధు అన్నేది ఉండకుండా ప్రజల్ని తినివేస్తాయి. కడపట ప్రభుత్వాన్నే కబళిస్తాయి. పట్టి డబ్బాలు వాయిస్తే యీ భూతాలు వదిలి పారిపోవు. కమిటీ పన్నాగాలు, ప్రణాళికా రచనలు, ఉపవాసోపన్యాసాలు, వనసంతర్పణలతో